కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి

• ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి చెన్నమ్మ

పోస్టర్లు విడుదల చేస్తున్న ఆశ వర్కర్లు

బిజినేపల్లి, డిసెంబర్ 18 : ఆశ వర్కర్ల కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ డిమాండ్ చేశారు. బుధవారం బిజినేపల్లి దవాఖాన ఆవరణలో ఆశ వర్కర్లతో కలిసి బస్సుయాత్రకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి తిరుగుతున్న బస్సు యాత్ర పోస్టర్లను విడుదల చేశామన్నారు. నాగర్‌కర్నూల్ కేంద్రానికి ఈనెల 24న బస్సు యాత్ర రావడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామ య్య, వరలక్ష్మి, జయమ్మ, కళావతి, దశరథం, శివలీల, శ్రీదేవి, చెన్నమ్మ ఉన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాధవ రెడ్డి

అచ్చంపేటటౌన్, డిసెంబర్ 18 : అచ్చంపేట పరిసర ప్రాంతంలోని ఉమామహేశ్వర క్షేత్రంలోని భోగ మహేశ్వరంలో అభివృద్ధి పనులను బుధవారం ఉమా మహేశ్వర ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో, ప్రభుత్వ నిధుల ద్వారా అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. క్షేత్రానికి వచ్చే ప్రజలకు అక్కడ సేద తీరేవిధంగా సౌకర్యవంతంగా విడిది రూములను ఏర్పాటు చేశామని తెలిపారు. గడ్డి పరకలతో ఓం నమఃశివాయ అనే శ్లోకంతో డిజైన్‌ను తయారు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చే సంక్రాంతి పండుగ వరకు పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ పవన్, నాయకుడు గోపాల్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

• అదనపు కలెక్టర్ సీతారామారావు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 18 : భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సీతారామారావు అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని రెవెన్యూ, నీటి పారుదలశాఖ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులైన కేఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ విషయంలో సంబంధిత శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ వివరాలను ప్రాజెక్టుల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేఎల్ఐ లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా సేకరించాల్సిన మొత్తం భూమి 25,247.13 ఎకరాలకు గనూ 21,613.87 ఎకరాల భూమిని సేకరించామని, ఇంకా 3633.26 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని సంబంధిత అధికారులు త్వరితగతిన భూసేకరణ జరపాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే 167కు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో కేఎల్ఐ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అరుణరెడ్డి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఇరిగేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యాదగిరి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి ఆర్డీవోలు సురేశ్, మాధవి, శ్రీను, ఏఈ, డీఈ, ఈఈలు, అధికారులు పాల్గొన్నారు.

చెంచులకు రగ్గులు పంపిణీ

అచ్చంపేట, డిసెంబర్ 18 : నల్లమల అటవీ ప్రాంతంలోని ఆదివాసి చెంచులకు హైదరాబాద్‌కు చెందిన శివరాచర్ల, వివేక్‌రెడ్డి మిత్రబృందం రగ్గులు పంపిణీ చేశారు. సంగిడిగుండాలు, మేడిమల్కాల చెంచుపెంటల్లో దాదాపు 75మంది చెంచు కుటుంబాలకు దాదాపు రూ.32వేల విలువగల ఉలన్ రగ్గులు అందజేశారు. అటవీప్రాంతంలో జీవిస్తున్న చెంచులు చలికి ఇబ్బంది పడకుండా తమవంతుగా ఆదుకునేందుకు ప్రతి ఏడాదిలో భాగంగా ఈసారి కూడా రగ్గులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మదన్‌రెడ్డి, మహేశ్, జర్నలిస్ట్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

• సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి

అంబేద్కర్ కూడలిలో మానవహారం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 18 : హన్మకొండలోని ఏకశిలా పార్క్ దీక్షా శిబిరంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి కోరారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె బుధవారంతో 9వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో మానవహారం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ము రళి మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా ఎంఈవో, డీఈవో కార్యాలయాలు మూత పడ్డాయని, విద్యాశాఖ అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా స్తంభించి పోయిందన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ భవిత పాఠశాలలో బోధన బం ద్ అయ్యిందని తెలిపారు. పాఠశాల విద్యా వ్యవస్థ అ డ్మినిస్ట్రేషన్, ఆన్‌లైన్ పనులు కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని, రీ ఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిచో మా సమస్యలు తీర్చే వరకు సమ గ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రకాశ్, కోశాధికారి సందీప్, సాయికుమార్, సుధాకర్, కుర్మయ్య, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న పీఏసీసీఎస్ చైర్మన్లు

కల్వకుర్తి, డిసెంబర్ 18 : అర్హులైన రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని కోరుతూ కల్వకుర్తి డివిజన్‌కు చెందిన పీఏసీసీఎస్ చైర్మన్‌లు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహాజన సభలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సహకార సంఘాల్లో తీసుకున్న చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రుణమాఫీ కాని రైతులు పీఏసీసీఎస్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, రుణమాఫీ కాని రైతుల జాబితాను డీసీసీబీ చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గురువయ్య, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ/కల్వకుర్తి, డిసెంబర్ 18 : మండలంలోని నారాయపూర్‌లో బానవత్ కేశ్లీ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, సానుభూతి తెలియపర్చారు. రూ.5వేలు నగదు ఆర్థిక సాయం మృతురాలి భర్తకు అందజేశారు. అదేవిధంగా మండలంలోని తిమ్మినోనిపల్లికి చెందిన సామపుల్లమ్మ మంగళవారం మృతి చెందింది. బీఆర్ఎస్ మండల నాయకుడు రాజు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఉప్పల ట్రస్ట్ ద్వారా రూ.3వేలు, తన సొంతంగా రూ.2వేలు చొప్పున రూ.5వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన గోవింద్ అలివేలమ్మ కుటుంబాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. అలివేలమ్మ మరణించిన విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అంతకుముందు అలివేలమ్మ మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు శివ, రాంచందర్, శ్రీనునాయక్, తారాసింగ్, కౌన్సిలర్ బోజిరెడ్డి ఉన్నారు.

రెవెన్యూ కార్యాలయం ప్రారంభం

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని నూతన రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సేవలు ప్రారంభమయ్యాయి. ఇంతకుముందు వరకు అద్దె భవనంలో కొనసాగిన తాసీల్దార్ కార్యాలయం సొంత భవనంలోకి మారడంతో మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మోహన్, డిప్యూటీ తాసీల్దార్ రమేశ్‌నాయక్ కార్యాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. గురువాం నుంచి సొంత భవనంలోనే ప్రజలకు రెవెన్యూ సేవలు కొనసాగించడం జరుగుతోందని మండల ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పెడుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

ఉప్పునుంతల, డిసెంబర్ 18 : మండలంలోని వెల్టూర్, సీబీ తండాల్లో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఎంపీడీవో మోహన్‌లాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

• డీఈవో రమేశ్‌కుమార్

మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

తాడూరు, డిసెంబర్ 18 : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరిలోని ప్రతిభను వెలికి తీసి వారిని ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా కృషి చేయాలని విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పరీక్షలకు జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి టెస్ట్‌లు భవిష్యత్తులో రాబోయే అన్ని రకాల పోటీ పరీక్షలకు ఒక అనుభవంగా ఉపయోగపడుతుందన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో సైన్స్ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారని దానికి ఈ పరీక్షలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తాడూరు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌వో రాజశేఖర్‌రావు, తాడూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్యాగరాజుగౌడ్, ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా ఫోరం కోశాధికారి సి.తిరుపతయ్య, రాష్ట్ర కౌన్సిలర్ పి.రాఘవేందర్, కే.సురేశ్‌బాబు, వి.సురేశ్‌బాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, టీబీఎస్ఎఫ్ సభ్యులు గాన్సిరాం, నిర్మల, శ్రీలత, జిల్లాలోని వివిధ మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తాం

• ఎంపీడీవో బ్రహ్మచారి

తాడూరు, డిసెంబర్ 18 : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని ఎంపీడీవో బ్రహ్మచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రస్తుతం జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేతోపాటు ఇందిరమ్మ ఇండ్ల సర్వే, స్థానిక సంస్థల పోలింగ్ స్టేషన్స్, డాటా ఎంట్రీ, నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్, ప్రైమరీ బెడ్స్, రోడ్డు సైడ్ ప్లాంట్స్‌కు పాదులు, ట్రీగార్డ్స్ అరెంజ్ చేయడం, టాక్సెస్ టేడ్ లైసెన్సుపై ఏపీవో కలిసి రివ్యూ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

దోమలపెంట, డిసెంబర్ 18 : అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామం, ఈగలపెంట జెన్‌కోలో క్రైస్తవ ఉద్యోగస్థుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజినీర్లు రామసుబ్బారెడ్డి, కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవ ఉద్యోగస్థులందరికీ, కాలనీవాసులకు సెమీ క్రిస్మస్ శుభకాంక్షలు తెలిపారు. ఉద్యోగస్థులందరు సహోదర భావంతో మెలుగుతూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్‌కట్ చేసి సెమీ క్రిస్మస్ శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ అదినారాయణ, ఎస్ఈ రవింద్రకుమార్, డీఈ శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, ఇబ్రహీం, రవి, ఆనంద్ జోషి, సునీల్, అధికారులు, క్రైస్తవ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను చెల్లించాలి

• సీఐటీయూ కోశాధికారి అశోక్

ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, డిసెంబర్ 18 : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ కోశాధికారి అశోక్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఏవో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు లేవని దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అప్పులు చేస్తూ జీవనం వచ్చే అరకొర జీతాలు కూడా సకాలంలో రాక ఇబ్బందులకు లోనవుతున్నారని పేర్కొన్నారు. వంట మనుషులుగా పని చేస్తున్న వారందరికీ కాటన్ దుస్తులు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికైనా పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మధు, తారాసింగ్ పాల్గొన్నారు.

లేగ దూడపై చిరుత దాడి

దోమలపెంట, డిసెంబర్ 18 : అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలో రైతు చిట్టెం శ్రీనివాస్‌రెడ్డికి చెందిన దూడను చిరుత బుధవారం ఉదయం దాడి చేసి చంపింది. ఇంటికి కూతవేటు దూరంలోనే లాక్కొని వెళ్లి పడేసింది. దోమలపెంట ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ గురుప్రసాద్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, చిరుతే దూడపై దాడి చేసినట్లు నిర్ధారించారు. దూడ విలువ దాదాపు రూ.30వేలు ఉంటుందని బాధితుడు తెలుపగా చిట్టెం శ్రీనివాస్ రెడ్డికి నష్టపరిహారం చెల్లిస్తామని ఫారెస్ట్ రెంజ్ అధికారి గురుప్రసాద్ తెలిపారు. దోమలపెంట, ఈగలపెంట పరిధిలో కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తున్నదని స్థానికులు భయానికి గురవుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

అచ్చంపేటరూరల్, డిసెంబర్ 18 : ఆశ వర్కర్లకు రూ.18వేలు వేతనం అందించాలని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లతో కలిసి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. తమకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఐహెచ్ఎం స్కీంలో 19 ఏండ్లుగా పనిచేస్తున్నామని గుర్తు చేశారు. ఈనెల 24వ తేదీన జిల్లా కేంద్రానికి బస్సుజాత రావడం జరుగుతుందని ప్రతి ఒక్క ఆశ వర్కర్ పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు శివలీల, నిర్మల, లక్ష్మి, పార్వతమ్మ, దేవి, ఇందిరమ్మ, అలివేల, శ్యామల, బాలమణి, సాయిలమ్మ, శ్యామల, మంగమ్మ పాల్గొన్నారు.

మండలంలో ఇంటింటి సర్వే

బల్మూరు, డిసెంబర్ 18 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం అధికారులు ఇండ్ల ఇంటింటి సర్వే చేశారు. గ్రామాల్లో అధికారులు మొదటి ప్రాధాన్యతగా పూర్తిగా ఇల్లు లేనివారికి, ఇంటి స్థలం ఉన్న వారికి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో అధికారులు లబ్ధిదారుల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రజా సంఘాల నాయకులు తదితరులు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇల్లు ఇవ్వాలని అక్రమాలకు పాలుపడుతే చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణమాఫీ చేయరా ?

వంగూరు, డిసెంబర్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికీ మాత్రమే రుణమాఫీ చేసిందని, మిగిలిన రైతులకు రుణమాఫీ చేయలేదని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల నాయకుడు లక్ష్మణ్ బుధవారం ప్రకటనలో కోరారు. కేవలం కొంత మందికి మాత్రమే రుణమాఫీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. సాంకేతిక సమస్యల వల్ల మాఫీ కాని రైతులు, 2లక్షలపైన ఉన్న రైతులకు రుణామాఫి అందక వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. చాలా మంది రైతులు బ్యాంకులో ఉన్న ఖాతాలో పాలబిల్లులు, ఇతర పత్తి, వడ్ల బిల్లులు జమైనా ఖాతాలు లాక్ కావడంతో వారు డబ్బులను తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికపై హర్షం

సాధిక్

లింగాల, డిసెంబర్ 18 : మండలంలోని అంబటిపల్లికి చెందిన సాధిక్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన సందర్భంగా బుధవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి ఖోఖోలో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవిశంకర్, మాజీ వైస్ ఎంపీపీ నా రాయణగౌడ్, గ్రామస్తులు సాధిక్‌ను అభినందించారు.

ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయుడిగా రాజశేఖర్

రాజశేఖర్‌రావు

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 18 : బీఎస్‌టీఎఫ్ 2025 నిర్వాహణలో భాగంగా జాతీయ ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయ అవార్డును నాగర్‌కర్నూల్ జిల్లాలోని చిన్నముద్దునూరు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాజశేఖర్‌కు ప్రకటించింది. ఈ కార్యక్రమానికి దేశంలో ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొంటారు. ఇది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శాస్త్రీయ దృక్పదంపై అవగాహన కల్పించడం కోసం దేశంలో దాదాపు 20 రాష్ట్రాల్లో చురుకుగా పని చేస్తూ దేశ వ్యాప్తంగా జాతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌ను నిర్వహిస్తారు. నేషనల్ టీచర్ సైంటిస్ట్ కౌన్సిల్ రామన్ సైన్స్ టెక్నాలజి ఫౌండేషన్ సర్దార్ పటేల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఇండియన్ ప్లానెటరి సొసైటీ (ముంబై) బాబా నేషనల్ రీసెర్చ్ ఆకాడమీ నేషనల్ చిల్డ్రన్ మాథ్స్ ఆకాడమీ మొదలగు సంస్థలు కలిసి దేశ వ్యాప్తంగా విద్యార్థుల మధ్య సైన్స్ ఫేయిర్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దేశంలో ఒకే ఒక జాతీయ ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయు అవార్డును నాగర్‌కర్నూల్ జిల్లాలోని చిన్నముద్దునూరు పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయులు రాజశేఖర్‌రావుకు ఇవ్వడం జరుగుతుంది. రామన్ సైన్స్ టెక్నాలజి ఫౌండేషన్ అధ్యక్షుడు జోషి, ఇస్రో శాస్త్రవేత్త దిలీప్ భట్, ఆల్ ఇండియా మాథ్స్ గురుగా పిలువబడే బీఎన్‌రావుచేతులమీదుగా రాజశేఖర్‌రావు ఈ అవార్డును అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ ఆయనను ప్రశంసించారు.

వ్యక్తికి రిమాండ్

అమ్రాబాద్, డిసెంబర్ 18 : మండలంలోని కల్మలోనిపల్లి గ్రామానికి చెందిన కల్ముల మధును బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. గత వారం అదే గ్రామానికి చెందిన చిన్న బాలయ్యను కర్రతో కొట్టి చంపినట్లు నిర్ధారణ కావడంతో విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, S.D.Jeelan S/o S.D Pasha, aged 50 years, Occ: Business R/o H.No.22-57, Santha Bazar, Nagar kurnool **Applicant / Borrower / Property holder** నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కు గాని, అక్షేపణలు గాని ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియ జేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల వారు షెడ్యూల్డ్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన అక్షేపణలు చెల్లనేరవు.

SCHEDULE OF THE PROPERTY:
All that the part and parcel of residential house plot No.7 total extent 189.75 Sq.yards, in Sy.No.47/A1 situated within the limits of Desi Itikyala Village, Nagarkurnool Mandal & Dist.
Bounded by: East: Land of others, **West:** 20 ft road, **North:** Plot No.6, **South:** Plot No.8

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Sayed Fayoumalla Shareef S/o Rahamathulla Shareef, aged 51 years, Occ: Business, R/o Vatavarlapally, Amrabad, Nagarkurnool Dist. **Applicant / Borrower / Property holder** నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కు గాని, అక్షేపణలు గాని ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియ జేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల వారు షెడ్యూల్డ్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన అక్షేపణలు చెల్లనేరవు.

SCHEDULE OF THE PROPERTY:
All tha the part and parcel of house plot No.799 sourth part, an extent of 120 Sq.yards in Sy.Nos.446/AA, 452/A, 454/AA/2, 454/E, 455, 456/AA, 472/A, 445/AA, 446/E, 456/A, 457, 471/AA named as My City, situated in the limits of Kotra Village, Veldanda Mandal, Nagarkurnool Dist.
Bounded by: East: Plot No.787 part, **West:** 33 ft road, **North:** Plot No. 799 part, **South:** Plot No.800.

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరి డే కేర్ ఆసుపత్రిలో పని చేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. సంప్రదించవలసిన సెల్ నెం.8328035779.
NT- MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

ఎరువుల తయారీపై అవగాహన

తిమ్మాజిపేట, డిసెంబర్ 18 : మండలంలోని మారేపల్లి గ్రామం లో ఉపాధి కూలీలకు సేంద్రీయ సాగు, వర్మీకంపోస్ట్ ఎరువుల త యారీపై అవగాహన కల్పించారు. ఉన్నతి ప్రాజెక్ట్‌లో భాగంగా స్థాని క రైతు వేదికలో కూలీలకు వర్మీకంపోస్ట్ తయారీ విధానంపై ఏఈవో సాయిరాం వివరించారు. ఉపాధి కూలీలలో ఎక్కువ శాతం రైతులు ఉంటారని, వారు వానపాములను, వ్యర్థాలను ఉపయోగించి పలు వర్మీకంపోస్ట్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. రసాయన ఎరువుల కన్న సేంద్రీయ సాగులో ఎక్కువ దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మిదేవి, ఏపీవో సత్యానారాయణ పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

లింగాల, డిసెంబర్ 18 : బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కైలాస్ స త్యార్థి చిల్డ్రన్ ఫండేషన్ సౌజన్యంతో కోనేర్ సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో బాలల హక్కుల, రక్షణ, పిల్లల అక్రమ రవాణా అరికట్టాలని ఆయన సూ చించారు. బాల్యవివాహ నిరోదక చట్టం ప్రకారం అమ్మాయి 18, అబ్బాయిలకు 21లు ఉంటే పెండ్లీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు నాగరాజు, చంద్రశేఖర్, సీతారాం, మల్లేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్, రజిత ,మహిళా సంఘాల నాయకులు ఉన్నారు.

లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం

తిమ్మాజిపేట, డిసెంబర్ 18 : మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన శ్రీహరి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సీఎం కప్‌లో భాగంగా బుధవారం కల్వకుర్తిలో జరిగిన అథ్లెటిక్స్ ఎంపికలో లాంగ్‌జంప్ విభాగంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచారు. త్వరలో హన్మకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల శ్రీహరి సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికైనట్లు గ్రామస్తులు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

సోమశిలలో రాష్ట్ర పీసీసీఎఫ్ సువర్ణ పర్యటన

కొల్లాపూర్‌రూరల్, డిసెంబర్ 18 : కొల్లాపూర్ మండలం సోమశిల పర్యాటక ప్రాంతంలో రాష్ట్ర పీసీసీఎఫ్ సువర్ణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలు చాలా గ్రామాలు ఉన్నాయి. కాని నాలుగు గ్రామాల ప్రజల అంగీకారంతోనే వేరే ప్రాంతాలకు తరలించడం జరిగింది ప్రజలను దాదాపు 10 సంవత్సరాల నుంచి సురక్షిత ప్రాంతాలకు ఇక్కడి అధికారుల కృషి వల్ల ప్రజలు అంగీకారించడంతో వారికి నివాసం, వ్యవసాయం సాగుకోసం భూముల పరిశీలించానట్లు ఆమె పేర్కొన్నారు. అక్కడ ప్రజలతో మాట్లాడడం జరిగింది వారు ఎంతో సంతోషంగా ఆమె తెలిపారు. సోమశిల పర్యాటక ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి సోమశిల వద్ద నేషనల్ హైవే తీగల బ్రిడ్జి హైవే 167 రహదారి నిర్మాణం అక్కడ కేబుల బ్రిడ్జి కింద షాపింగ్ వంటి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి జరుగుతుంది. ఇది చాలా పెద్ద ప్రాజెక్టు ఫరెస్టు డెవలప్ కంపెనీ ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూలు జిల్లా ఎఫ్ రోహిత్, అమ్రాబాద్ ఫీల్ డైరెక్టర్ రాంబాబు, ఎఫ్‌డీవోలు తిరుమలరావు, రాంమూర్తి, ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 18 : తెలకపల్లిలో రెండో గ్రామ సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తాసీల్దార్ జాకీర్‌అలీ, డీపీఎం వెంకటేశ్ తనిఖీ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో మోసాలకు పాల్పడవద్దన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో 300 బస్తాల 120 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, వీవోఏ ఫర్హాదాబేగం పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 18 : తనను నమ్మించి కొన్నేళ్లుగా సహజీవనం చేసిన ప్రియుడు తర్వాత పెళ్లికి నిరాకరించాడని ప్రియురాలు నిరసన వ్యక్తం చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. వివరాలిలా.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్, నూర్జహాన్ కొద్దిరోజులుగా ప్రేమలో ఉన్నారు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ప్రవీణ్ కొన్నేళ్లుగా ఆమెతో సహజీవనం చేశాడు. తర్వాత పెళ్లి చేసుకోవాలని నూర్జహాన్ ఒత్తిడి తేవడంతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో షీ టీంను ఆమె ఆశ్రయించగా.. వారు కేసు నమోదు చేసి వ్యక్తిని రిమాండ్ చేశారు. అనంతరం జైలు నుంచి బెయిల్‌పై బయటికి వచ్చిన యువకుడు పెళ్లి చేసుకోవాలని అతడి ఇంటి ముందు బైఠాయించింది.